

ఐటీ కెరియర్‌కు నిచ్చెన మెట్లు!

గతి వాన వస్తే కలకాలం ఉండిపోదు. చెలరేగే తుపాను బీభత్సం చిరకాలం నిలిచిపోదు. సాధారణ పరిస్థితుల్లో వాతావరణం ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటుంది. మనల్ని ముందడుగు వేయమని ప్రోత్సహిస్తూనే ఉంటుంది. అందుకే మనం ప్రతికూల పరిస్థితులకు బెదిరిపోము. దాన్ని ఎలా ఎదుర్కోవాలో అందుకు తగ్గట్టు సిద్ధమవుతాం. ఇది తాత్కాలికమని మనకు తెలుసు. శాశ్వతం ఏమిటంటే సుస్థిరంగా సాగే ఎదుగుదలే. ఇదే మనకు ప్రాణ వాయువు.

ప్రస్తుత ఐటీ జాబ్ మార్కెట్ కూడా ఇంతే. ఉద్యోగావకాశాల్లో ఒడుదొడుకులు, ఆటుపోట్లు ఎల్లకాలం ఉండేవి కావు. మార్కెట్ పరిస్థితులు సద్దుమణుగుతూ మన ప్రస్థానం సాగుతూనే ఉంటుంది. ఎప్పటిలాగే భారత ఐటీ మార్కెట్ 2021-2031 సంవత్సరాల మధ్య పదేళ్లలో 25 శాతం వృద్ధి సాధిస్తుందనే అంచనా ఈ రంగ స్థిరత్వం చెక్కుచెదరదని చెబుతోంది. ఈ పదేళ్ల ప్రయాణంలో తాత్కాలిక మార్కెట్ ఒడుదొడుకులను డిస్కౌంట్ చేయాలే తప్ప రూటు మార్చుకోవాల్సిన తలపోటు లేదు.

ఐటీ మార్కెట్ దేశంలో మరే ఇతర రంగం పెరగనంత వేగంగా ఎదుగుతోందంటే ఇది ప్రధానంగా సాఫ్ట్‌వేర్ తయారీ కార్యకలాపాలకే వర్తిస్తుందని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. అంటే ఈ కిరీటం కోడింగ్‌కే దక్కుతుంది. ఐటీ కంపెనీల ఎదుగుదల గ్రాఫ్‌ను కోడింగ్ నిపుణులే ముందుకు మోసుకెళుతుంటారు. అందుకే, ఐటీ కంపెనీలు ఏ ఉద్యోగానికి గేట్లు మూసేసినా...కోడింగ్ నైపుణ్యంలో గట్టిగా నిలబడేవారిని పట్టి చేతులతో వెనక్కి పంపవు. కనుకనే కల్లోల మార్కెట్‌లో చెల్లుబాటయ్యే నైపుణ్యంగా కోడింగ్ వెలుగొందుతోంది.

అక్షయపాత్రలాంటి కోడింగ్ వృత్తికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాల గురించి గత కథనాల్లో తెలుసుకున్నాం కదా. ఈ నేపథ్యంలో అందిపుచ్చుకోవాల్సిన సాధారణ లక్షణాలనూ గుర్తించాలి. కోడింగ్ ఉద్యోగాన్ని కల్పించడంలో నైపుణ్య స్థాయిదే పైచేయి అయినప్పటికీ ప్యాకేజీ నిర్ధారణలో పది సాధారణ సామర్థ్యాలు ప్రగాఢంగా ప్రభావం చూపుతున్నాయి.

ఏమిటా సామర్థ్యాలు?

1 నిరంతర జిజ్ఞాస

విశ్వాంతరాళంలో ఏం జరుగుతోందన్న జిజ్ఞాసే స్టీఫెన్ హాకింగ్‌ను ప్రపంచం మరిచిపోలేని సైంటిస్టుగా చేసింది. భూమ్యాకాశాల మధ్యగల శక్తి ఏమిటన్న ఆసక్తే ఐన్‌స్టైన్‌ను గొప్ప శాస్త్రవేత్తగా నిలిపింది. మహాసాగరాల ఆవల ఏమున్నదో తెలుసుకోవాలన్న ఉత్కంఠ కొలంబస్‌ను సాహస యాత్రికునిగా, కొత్త భూభాగాలను కనుగొన్న నావికునిగా మలిచింది.

సరిగ్గా ఈ తెలుసుకోవాలన్న కోరికే సాంకేతిక నిపుణులనూ అందలం ఎక్కిస్తుంది. సాఫ్ట్‌వేర్ తయారుచేయాలన్నా, కొత్త ప్రోగ్రామ్ రాయాలన్నా ఆసక్తి నుంచే బీజం ప్రారంభమవుతుంది. కొత్త విషయాలు తెలుసుకోవాలన్న లక్షణమే అందుకు పునాది. ఆ ఆసక్తే లేకపోతే ఎంతటి కోడింగ్ ఘనాపాఠీలైనా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న తీరున మొదలు పెట్టిన చోటునే నిలబడిపోతారు.

2 బేసిక్స్‌పై పట్టు

ప్రోగ్రామ్ రాయడమెలాగో తెలిసి ఉండటం వేరు. ఈ నైపుణ్యంపై పట్టు ఉండటం వేరు. కోడింగ్ నేర్చుకోవడంతోనే ఆగిపోతే కేవలం ఎంట్రీ స్థాయి కొలువులకే పరిమితం కావాలి. ఒక నైపుణ్యంపై గట్టిపట్టు తెచ్చుకోడానికి తొలిమెట్టు- నేర్చుకోవడమైతే... ఆపై ఒక్కోమెట్టు ఎక్కేకొద్దీ ఆ స్కిల్‌పై పట్టు సాధించే దిశగా ముందుకు దూసుకుపోతున్నట్టే.

కోడింగ్‌లో ముందుకెళ్లాలన్న ఆలోచనా సరళి.. ఆసక్తి నుంచే మొదలవుతుంది. వేర్వేరు ప్రోగ్రామింగ్ అప్లికేషన్స్‌ను పరిశీలిస్తుంటే వాటి వెనుక ఉన్న కోడింగ్ ఏమై ఉంటుందన్న జిజ్ఞాస జనించాలి. మనం రోజూ చూసే ట్రాఫిక్ సిగ్నల్స్, స్మార్ట్ టీవీలను గమనిస్తున్నప్పుడు వాటిలో ఇమిడివున్న కోడింగ్ ఏమిటో తెలుసుకోవాలన్న ఉత్సుకత కలగాలి. మనం వినియోగించే అన్ని యాప్స్ కూడా కోడింగ్ ఆధారంగా పనిచేసేవే. యాప్స్ ఉపయోగిస్తున్నప్పుడు వాటి గమనాన్ని నిర్దేశించే ప్రోగ్రామింగ్‌పై దృష్టి పెట్టాలి.

3 నిత్య సాధన

కోడింగ్ అనేది తర్కం (లాజిక్) ఆధారంగా పనిచేస్తుందన్న విషయం తెలిసిందే. చదవడంవల్లనో, చూడటం వల్లనో కాకుండా తర్క ఆధారిత సమస్యలను విస్తృతంగా సాధన చేయడం ద్వారానే లాజిక్‌ను పట్టుకోగలం. ఉద్యోగార్థుల్లో చాలామంది ఏ పొరపాటు చేస్తారంటే.. కోడింగ్ నేర్చుకున్న తర్వాత దీర్ఘకాలం ఎటువంటి సాధనా చేయరు. ప్లేస్‌మెంట్ ఎంపికల్లో టెక్నికల్ రౌండ్ సందర్భంలో కోడింగ్‌ను ఎదుర్కోలేక చతికిలపడతారు. లాజిక్‌ను అర్థం చేసుకోవడానికి అద్భుతమైన తెలివితేటలతో పని లేదు. కేవలం శ్రద్ధతో, ఆసక్తితో ప్రాక్టీస్ చేయడం వల్ల మంచి ఫలితం సాధించవచ్చు.

4 ప్రాజెక్టుల కసరత్తు

కోడింగ్ సాఫ్ట్‌వేర్ సాధనకు రెండు మార్గాలున్నాయి. మొదటిది- ప్లేస్‌మెంట్‌కు వచ్చే కంపెనీ గత ప్లేస్‌మెంట్స్ పరీక్షల ప్రశ్నపత్రాలు ఆన్‌లైన్‌లో లభ్యమైతే వాటిని సాధన చేయడం. రెండోది- కోడింగ్‌పై వివిధ రకాల ప్రాజెక్టులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా యూట్యూబ్‌లో లభ్యమయ్యే ప్రాజెక్టులను డౌన్‌లోడ్ చేసుకొని, వాటిపై కసరత్తు చేయడం ద్వారా మంచి ఫలితాలుంటాయి. అయితే ఇతర సోర్స్‌లపై ఆధారపడేటప్పుడు ఒక జాగ్రత్త తీసుకోవాలి. అభ్యర్థి అనుసరించే నమూనా ప్రాజెక్టులు ప్రస్తుతం కంపెనీలు తమ టెస్టుల్లో అడుగుతున్న నమూనాలకు దగ్గరగా ఉన్నాయో, లేదో చూసుకుంటుండాలి. లేకపోతే పాత నమూనాలను, గత ప్రాజెక్టులను ఫాలో అయితే తీరా టెస్టులో అడిగేవి భిన్నంగా ఉంటే విఫలమవుతారు.

5 డేటా స్ట్రక్చర్స్, అల్గారిథమ్స్

కోడింగ్ నైపుణ్యం అలవడాలంటే ప్రధానంగా- డేటా స్ట్రక్చర్స్, అల్గారిథమ్స్‌పై లోతైన అవగాహన పెంచుకోవాలి. సమాచారం పెద్ద జలరాశిగా కనిపిస్తున్నప్పటికీ గందరగోళపడకుండా, ఆ సమాచార ప్రవంతిలో అంతర్లీనంగా దాగివున్న నిర్మితులను (స్ట్రక్చర్స్) అర్థం చేసుకునేందుకు కృషిచేయాలి. వాటిని నడిపిస్తున్న అల్గారిథమ్స్‌పై కూడా అవగాహన చేసుకోవాలి. ఇలా వీలున్నన్ని స్ట్రక్చర్స్ అల్గారిథమ్స్‌ను అర్థం చేసుకోవడంవల్ల కొత్త కోడ్‌లను రాసే సామర్థ్యం అలవడుతుంది.

6 పొరపాట్ల నుంచి పాఠాలు

తప్పు చేయడం మానవ సహజం. అయితే చేసిన తప్పును మరోసారి చేయకపోవడం వివేకవంతుల లక్షణం. స్ట్రక్చర్స్, అల్గారిథమ్స్, లాజిక్‌లను అర్థం చేసుకొని కోడ్ నమూనాలు రాయడం మొదలుపెట్టాక పొరపాట్లు జరుగుతాయి. వాటిని వెంటనే పునస్సమీక్షలో గుర్తించడమూ.. ఆ తప్పులు ఎందుకు జరిగాయో గ్రహించి మళ్లీ అటువంటివి చేయకుండా కోడ్ రాయగలిగితే అడుగులు ముందుకు పడుతున్నట్టే. చాలామంది ఉద్యోగార్థులు జరిగిన పొరపాటుకు కారణం అన్వేషించే ఓపిక లేక చేసిన తప్పునే మళ్లీ మళ్లీ చేస్తూ చివరికి ఆత్మవిశ్వాసం కోల్పోతుంటారు.

7 తాజాగా.. ఎప్పటికప్పుడు

పోటీ ప్రపంచంలో ఉద్యోగార్థి నిత్య చైతన్యవంతంగా ఉండాలి. ప్లేస్‌మెంట్ టెస్టుల్లో కోడింగ్ స్కిల్లే ప్రధానం కాబట్టి వివిధ కంపెనీలు సంధిస్తున్న కోడింగ్ నమూనాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ఏ కంపెనీ కొత్తగా ఛాలెంజ్ వంటి ఏ కోడింగ్ మోడల్ ఇచ్చినా దాన్ని వెంటనే పరిశీలించాలి. దానిలో ఇమిడివున్న లాజిక్‌ను గుర్తించి, ఆపై అదే తరహా నమూనాలను ఎంపిక చేసుకొని సాధన చేయాలి. మొత్తమ్మీద వివిధ కంపెనీలు కోరుకుంటున్న కోడింగ్ మోడల్స్‌పై ఎప్పటికప్పుడు అభ్యర్థి అవగాహన పెంచుకుంటూ ఉండాలి!

8 కోడింగ్.. డాక్యుమెంట్

కోడింగ్ అనేది చదివి వదిలేసే కాల్పనిక నవల కాదు. దాని వెనుక తర్కాన్ని అర్థం చేసుకొని, మళ్లీ అటువంటి కోడ్‌ను రాయ వలసివస్తే సంసిద్ధంగా ఉండగలగాలి. అందుకే కోడింగ్‌పై సాధన చేశాక సాధ్యమైనంతవరకు దాన్ని డాక్యుమెంట్ చేయాలి. దీనివల్ల రెండు ప్రయోజనాలున్నాయి. ఒకటి- డాక్యుమెంట్ చేయడం వల్ల ఆ కోడింగ్‌ను మరచిపోలేరు. రెండోది- ఇలా వేర్వేరు కోడింగ్ డాక్యుమెంట్లు సిద్ధంగా ఉన్నందువల్ల ప్లేస్‌మెంట్ టెస్ట్‌లకు వెళ్లేముందు వాటిని వరుసగా చూసుకోవచ్చు. ఫలితంగా ఆత్మవిశ్వాసంతో టెస్టులు రాయగలుగుతారు.

9 ఇతరులకు బోధించడం

చదివింది అలాగే వదిలేస్తే జ్ఞాపకంలోకి చేరదు. చదివింది రాస్తే కొంతవరకు స్మృతిపథంలో నిక్షిప్తమవుతుంది. అదే.. చదివింది, తాను రాసిందీ మరికొందరికి బోధిస్తే ఆపై కలకాలం గుర్తుండిపోతుంది. బోధించే ప్రక్రియలో తనకు వచ్చింది గుర్తుకు తెచ్చుకోవడం, గుర్తుకురాని విషయాలను మళ్లీ తిరగేసి చూసుకోవడం, అర్థం కానిదాన్ని మరొకరిని అడిగి తెలుసుకొని స్పష్టత తెచ్చుకోవడం అనే దశలున్నాయి. వీటన్నిటినీ దాటి ఎదుటివారికి అర్థమయ్యేలా బోధించడంవల్ల సబ్జెక్టుపై పట్టు వస్తుంది. కోడింగ్ విషయంలో ఈ సూత్రం బాగా పనిచేస్తుంది. తాను నేర్చుకున్న కోడింగ్ పాఠాలను మరో పదిమందికి చెప్పడం ఉద్యోగార్థికి లాభిస్తుంది.

10 నిరంతరం ఇదే ధ్యాస

ఐటీ రంగంలో కోడింగ్ ప్రొఫెషనల్‌గా ప్రవేశించాలనుకుంటున్న ఉద్యోగార్థి నిరంతరం అదే దృష్టితో ఉండాలి. అదే ధ్యాసతో సాధన చేయాలి. ఏ వెబ్‌సైట్ వీక్షించినా, ఏ యాప్‌ను వినియోగించినా, ఏ పరికరాన్ని పరిశీలించినా దానిలో ఇమిడివున్న ప్రోగ్రామ్‌ను గుర్తించే ప్రయత్నం చేస్తుండాలి. వాటి గమనానికి కారణమైన కోడింగ్‌ను గుర్తించాలి. వెంటనే ఆ తరహా కోడింగ్ నమూనాలను సాధన చేయాలి. ఇలా నిరంతరం అదే దృష్టితో ఉండటం వల్ల ప్లేస్‌మెంట్ టెస్టులను ఉత్సాహంగా ఎదుర్కోగలుగుతారు.

ఇప్పటివరకు ప్రస్తావించిన పది అంశాల్లో కోడింగ్‌లో ఉద్యోగ కిరీటధారి కావాలంటే సహకరించే సాధారణ, సాంకేతిక సామర్థ్య అంశాలున్నాయి. వీటన్నింటి వెనుక ఉన్నది.. కోడింగ్ కెరియర్‌లో ప్రవేశించాలన్న కాంక్ష బలంగా ఉండాలని చెప్పడమే. సంకల్పం దృఢంగా ఉన్నప్పుడు సాంకేతిక, సాధారణ సామర్థ్యాలు ఐటీ జాబ్‌కి నిచ్చెన మెట్లవుతాయి.

- యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

నోటీస్ బోర్డు

అప్రెంటిస్‌షిప్

ఎన్‌హెచ్‌పీసీ, హిమాచల్ ప్రదేశ్‌లో..

హిమాచల్ ప్రదేశ్, నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ - ఒప్పంద ప్రాతిపదికన 50 ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ట్రేడులు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ (మోటర్ వెహికల్), టర్నర్, మెషినిస్ట్, వెల్డర్ (గ్యాస్, ఎలక్ట్రిక్), సీఓపీఏ.
అర్హత: సంబంధిత ఐటీఐ ట్రేడ్. **వయసు:** 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉండాలి. **ఎంపిక:** ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ల వెరిఫికేషన్ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ప్రకటన వెలువడిన 15 రోజుల్లోపు.
వెబ్‌సైట్: https://www.nhpcindia.com/welcome/job

వాక్-ఇన్స్

ఏఏఐఎస్ఎల్‌లో వివిధ పోస్టులు

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్... ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన పుణెలోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో 247 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
★ డిప్యూటీ టెర్మినల్ మేనేజర్: 02 ★ డ్యూటీ ఆఫీసర్: 07 ★ జూనియర్ ఆఫీసర్- ప్యాసింజర్: 06 ★ జూనియర్ ఆఫీసర్- టెక్నికల్: 07 ★ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: 47 ★ ర్యాంప్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: 12 ★ యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్: 17 ★ హ్యాండీమ్యాన్: 119 ★ హ్యాండీ ఉమన్: 30
అర్హత: పోస్టును బట్టి 10వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏతో పాటు పని అనుభవం.
ఎంపిక: పోస్టును అనుసరించి ట్రేడ్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీలు: ఏప్రిల్ 15, 17, 18, 19, 20.
వేదిక: పుణె ఇంటర్నేషనల్ స్కూల్, సర్వే నెం.33, లేన్ నంబూర్ 14, టింగ్రే నగర్, పుణె, మహారాష్ట్ర.
వెబ్‌సైట్: https://www.aiasl.in/Recruitment

రైట్స్, గుడ్‌గావ్‌లో ప్రాజెక్ట్ లీడర్లు

గుడ్‌గావ్, రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ - ఒప్పంద ప్రాతిపదికన 31 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

★ ప్రాజెక్ట్ లీడర్: 1 ★ టీమ్ లీడర్: 05
★ డిజైన్ ఎక్స్‌పర్ట్: 06 ★ రెసిడెంట్ ఇంజినీర్: 18 ★ ఇంజినీర్: 1
అర్హత: డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీలో సివిల్ ఇంజినీరింగ్‌తో పాటు పని అనుభవం. **వయసు:** 55 సంవత్సరాలు మించరాదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16-04-2024
ఇంటర్వ్యూ తేదీలు: ఏప్రిల్ 12, 15, 16.
ప్రదేశం: 1. శిఖర్, ప్లాంట్ 1, లైజర్ వాలే, రైట్స్ భవన్, ఐఎఫ్ఎఫ్‌సీఓ చౌక్ మెట్రో స్టేషన్, సెక్టార్ 29, గురుగ్రాం, 122001, హరియాణా.
2. రైట్స్ ఆఫీస్, 404, ద్వారకేష్ బిజినెస్ హబ్, తపోవన్ సర్కిల్ మోటెర, అహ్మదాబాద్- 380005
3. రైట్స్ ఆఫీస్, 741/742, 4వ ఫ్లోర్, టవర్ నెం.3,7 సెక్టార్- 30ఎ, ఇంటర్నేషనల్ ఇన్‌ఫోటెక్ పార్క్, వాషి రైల్వే స్టేషన్ కాంప్లెక్స్, నవీ ముంబయి. **వెబ్‌సైట్:** https://www.rites.com/Career

చదువు
కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీ సందేహాలు మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.
మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ - 501 512
edc@eenadu.in

ఎంఏ తర్వాత ఐటీఐ చేస్తే?

ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఈమధ్యే పూర్తిచేశానీ దీంతో ఎక్కువ ఉద్యోగావకాశాలు లేవనిపిస్తోంది. ఇప్పుడు ఐటీఐ చేసి ఆర్ఆర్‌బీ, జేఎల్ఎం, ఇతర టెక్నీషియన్ కోర్సులకు సన్నద్ధం అవటం మెరుగేనా? **- ఎన్.రమేష్‌కుమార్**

■ మీరు ఎంఏ పూర్తి చేశారంటే, మీ వయసు కనీసం 23 ఏళ్ల ఉంటుంది. ఇప్పుడు ఐటీఐ చేస్తే, మరో రెండేళ్లు చదవాలి. అంతేకాకుండా, మీకంటే పది సంవత్సరాలు తక్కువ వయసున్నవారితో కలిసి విద్య అభ్యసించాలి. ఐటీఐ చేశాక కూడా ఉద్యోగం రావడం కష్టమయితే, అప్పుడు ఏం చేస్తారు? మీకు ఐటీఐ కోర్సు అంటే ఇష్టమా, ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయనే ఉద్దేశంతోనా? ప్రస్తుతం ప్రతి ఉద్యోగానికీ చాలా పోటీ ఉంది. అందుబాటులో ఉన్న ఉద్యోగాలు వేలల్లో ఉంటే, వాటికి అర్హులయిన వారు లక్షల్లో ఉన్నారు. ఈ పోటీ ప్రపంచంలో రాణించాలంటే- అందుబాటులో ఉన్న తక్కువ కొలువుల కోసం పోటీ పడి, మెరుగైన ప్రతిభతో ఉద్యోగం పొందే ప్రయత్నం చేయాలి.

చాలామంది ఉద్యోగం అంటే ప్రభుత్వ ఉద్యోగం అనే భావనతో ఉంటున్నారు. ముందుగా దీన్నుంచి బయటకు వచ్చి నచ్చిన పని చేస్తూ సంబంధిత రంగంలో ఎదిగే ప్రయత్నం చేయటం ఉత్తమం. ఒకవేళ మీరు ఐటీఐ చేసి ప్రభుత్వ ఉద్యోగం పొందినా, మీ పీజీ చదువుకు తగిన ఉద్యోగం పొందలేక పోయానని బాధ పడవచ్చు. అలాకాకుండా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పీజీతో కానీ, మీ డిగ్రీ విద్యార్హతతో కానీ, ఉద్యోగ ప్రయత్నాలు చేయండి. కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాలతో పాటు స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ లాంటి ఉద్యోగాలకోసం ప్రయత్నించండి. బీఈడీ చేసి బోధనరంగంలో ప్రయత్నాలు చేయవచ్చు. బీఈడీ చేసి రాష్ట్ర ప్రభుత్వ డీఎస్సీ కోసం మాత్రమే ఎదురుచూడకుండా నవోదయ, కేంద్రీయ విద్యాలయ లాంటి కేంద్రీయ విద్యాసంస్థల్లోనూ ఉద్యోగ ప్రయత్నాలు చేయండి. ఆసక్తి/ అవకాశం ఉంటే జర్నలిజం, లైబ్రరీ సైన్స్, మేనేజ్‌మెంట్, ఎల్ఎల్‌బీ లాంటి ప్రొఫెషనల్ కోర్సుల గురించి కూడా ఆలోచించండి. ఇంగ్లిష్ భాషపై కొంత పట్టుంటే ఎంఏ ఇంగ్లిష్ చదివి బోధన రంగంలో ఉపాధి అవకాశాలు పెంచుకోవచ్చు. మీ పీజీ విద్యార్హతతో స్వచ్ఛంద సేవాసంస్థల్లో, ప్రభుత్వేతర సంస్థల్లో, రిటైలింగ్ రంగంలో ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు. ఇవన్నీ వీలుకాకపోతే మీరు అనుకున్నట్లుగా, ఐటీఐ చేసి మీరనుకుంటున్న కోర్సులూ.. కొలువుల ప్రయత్నాలు చేయండి.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

గేట్ స్కోరుతో... ఏఏఐలో అవకాశాలు

న్యూదిల్లీలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) దేశవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లో 490 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. విద్యార్హతలు, గేట్ స్కోరు ఆధారంగా ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

మొత్తం 490 ఉద్యోగాల్లో.. అన్‌రిజర్వుడ్‌కు 240, ఈడబ్ల్యూఎస్‌లకు 45, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు 106, ఎస్సీలకు 73, ఎస్టీలకు 26 కేటాయించారు.

1. **జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఆర్కిటెక్చర్)-3:** ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ పాసై, కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో రిజిస్టరైవుండాలి.
2. **జేఈ (సివిల్) - 90:** బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ సివిల్ ఇంజినీరింగ్/ టెక్నాలజీ డిగ్రీ ఉత్తీర్ణులు కావాలి.
3. **జేఈ (ఎలక్ట్రికల్) - 106:** బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రికల్/ టెక్నాలజీ పాసవ్వాలి.
4. **జేఈ (ఎలక్ట్రానిక్స్) - 278:** బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ ఇంజినీరింగ్/ టెక్నాలజీ ఇన్ ఎలక్ట్రానిక్స్/ టెలికమ్యూనికేషన్స్/ ఎలక్ట్రికల్ (ఎలక్ట్రానిక్స్ స్పెషలైజేషన్‌తో) ఉత్తీర్ణత సాధించాలి.
5. **జేఈ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) -13:** బీఈ ఇన్ ఇంజినీరింగ్/ టెక్నికల్ ఇన్ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ ఇంజినీరింగ్/ ఐటీ/ ఎలక్ట్రానిక్స్ లేదా మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్ (ఎంసీఏ) పాసవ్వాలి.

■ అన్ని పోస్టులకూ గేట్-2024 స్కోరు ఉండాలి.

బీఈ/ బీటెక్/ బీఎస్సీ (ఇంజినీరింగ్) పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అర్హులు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేయొచ్చు. అయితే ధ్రువపత్రాల పరిశీలన సమయానికి పాసైవుండాలి.

01.05.2024 నాటికి 27 సంవత్సరాలు మించకూడదు. గరిష్ఠ వయసులో.. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు, ఏఏఐలో ఏడాది ప్రొబేషన్ పూర్తిచేసినవారికి పదేళ్ల సడలింపు ఉంటుంది. ఎక్స్-సర్వీస్‌మెన్‌కు ప్రభుత్వ తాజా నిబంధనలకు అనుగుణంగా మినహాయింపు వర్తిస్తుంది.

దరఖాస్తు రుసుము రూ.300 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలు, ఏఏఐలో ఏడాది అప్రెంటిస్‌షిప్ శిక్షణ పూర్తిచేసినవారు ఫీజు చెల్లించనవసరం లేదు.
ఎంపిక: దరఖాస్తులో తెలిపిన వివరాల ఆధారంగా అప్లికేషన్ వెరిఫికేషన్‌కు షార్ట్‌లిస్టును తయారుచేస్తారు. వెరిఫికేషన్ సమయంలో ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించాలి.

■ అప్లికేషన్ వెరిఫికేషన్‌కు ఎంపికైనవారి వివరాలను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. కాల్ లెటర్లను అభ్యర్థుల ఈమెయిల్ ఐడీకి పంపిస్తారు.

■ కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వ/ ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్నవారు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'ను అప్లికేషన్ వెరిఫికేషన్ సమయంలో సమర్పించాలి.

■ ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకానివారి అభ్యర్థిత్వాన్ని రద్దుచేస్తారు.

■ గేట్ స్కోర్‌కు మొదటి ప్రాధాన్యమిస్తారు.

■ ఎంపికైనవారికి ఆరు నెలల శిక్షణ ఉంటుంది. వీరిని దేశవ్యాప్తంగా ఎక్కడైనా నియమించే అవకాశం ఉంటుంది.

■ ఈ పోస్టులకు దరఖాస్తు చేయడానికి అనుభవం అవసరం లేదు. ప్రకటనలో పేర్కొన్న విద్యార్హతలు, గేట్ స్కోర్ ఉంటే సరిపోతుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 01.05.2024
వెబ్‌సైట్: https://www.aai.aero/

రామానంద తీర్థ సంస్థలో ఉపాధి కోర్సులు

యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ... ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ప్రాంత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజనం, వసతి కల్పిస్తారు.
శిక్షణ, కాల వ్యవధి వివరాలు...
1. బేసిక్ కంప్యూటర్స్ (డేటా ఎంట్రీ ఆపరేటర్): 03 నెలలు
అర్హత: ఇంటర్మీడియట్.
2. అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ): 03 నెలలు
అర్హత: బీకాం.
3. కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్: 03 నెలలు
అర్హత: ఇంటర్మీడియట్.
4. ఆటోమొబైల్- టూ వీలర్ సర్వీసింగ్: 03 నెలలు
అర్హత: పదోతరగతి.
5. సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ డివైజ్ రిపేర్: 04 నెలలు
అర్హత: పదోతరగతి.
6. ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్): 05 నెలలు
అర్హత: పదోతరగతి, ఐటీఐ.
7. సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్/ సర్వీస్: 04 నెలలు
అర్హత: పదోతరగతి, ఐటీఐ.
వయసు: 18-35 ఏళ్ల మధ్య ఉండాలి.
దరఖాస్తు: ఆసక్తి ఉన్న అభ్యర్థులు నిజ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, ఇన్‌కం సర్టిఫికెట్, నకళ్లు, ఫొటోలతో సంస్థ చిరునామాలో సంప్రదించాలి.
అడ్మిషన్ తేదీ: 15-04-2024 ఉదయం 10 గంటలు.
చిరునామా: స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, జలాల్‌పూర్ (గ్రామం), పోచంపల్లి (మండలం), యాదాద్రి భువనగిరి జిల్లా.
వెబ్‌సైట్: https://www.srtri.com/index.php

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

కంటెంట్ క్రియేషన్

సంస్థ: లీడ్ మైన్స్ మీడియా
నైపుణ్యాలు: కంటెంట్ క్రియేషన్
స్టైపెండ్: నెలకు రూ.3,000-4,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 18
☛ internshala.com/i/04ca16

కస్టమర్ ఎక్స్‌పీరియన్స్

సంస్థ: ప్యాషన్‌మోజో
నైపుణ్యాలు: కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఈమెయిల్, లింక్డ